

దహెగాం: కోత్మీర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌటాల: వారసంతలో భారీ ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కాగజ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం
- రోజురోజుకూ పెరుగుతున్న జోష్



కాగజ్‌నగర్: ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, నవంబర్ 27: రాష్ట్రం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు వచ్చి చెప్పే మాటలు నమ్మొద్దని సిర్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బోడేపల్లి, చారిగాం, తదితర గ్రామాల్లో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూలమాలతో స్వాగతించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రచార సభలో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పటి నుంచి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కులమతాలకు అతీతంగా పాలన కొనసాగుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సమానమైన పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**● దహెగాం మండలంలో..**

దహెగాం,నవంబర్27: మండలంలోని కోత్మీర్, బీబ్రా ఐనం గ్రామపంచాయతీల్లో జడ్పీటీసీ సోమవారం తాళ్లపల్లి శ్రీరామరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా మ్యానిఫెస్టో కరపత్రాలను పంచుతూ ఈవీఎం నామూనాను చూపించారు. ఈ ప్రచారంలో రైతుబంధు మండల కన్వీనర్ కంభగౌని సంతోష్‌గౌడ్,సర్పంచ్‌లు తరున్నం సుల్తాన, బండ కృష్ణమూర్తి, వెలుముల జయందర్, ఎంపీటీసీ శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**● బెజ్జూర్‌లో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం**

బెజ్జూర్, నవంబర్ 27 : మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి స్థానిక జడ్పీటీసీ పంద్రం పుష్పలతతో పాటు మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి వాడవాడలా తిరిగి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఆమె మండల కేంద్రంలోని అతి పురాతన రంగనాయక స్వామి ఆలయంలో దైవ దర్శనం చేసుకొని ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలోని మారుమూల మండలం బెజ్జూర్ మరింత అభివృద్ధి జరగాలంటే తన భర్త కోనేరు కోనప్ప కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం ఆమె ఇంటింటా తిరుగుతూ ఈవీఎం నమూనాను ఓటర్లు చూపుతూ మిషన్‌లో మొదటి స్థానంలోనే ఉన్న కోనప్ప కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిడం సకారాం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, సింగిల్ విండో చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, నాయకులు డోకె వెంకన్న, నాహెర్ అలీ, పుల్లూరి సతీశ్ కుమార్, నరేందర్ గౌడ్, జావీద్ అలీ ఖాన్, నరేందర్ గౌడ్, తంగెడిపల్లి మహేశ్, జాహిద్ హుస్సేన్, ఇతర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

**● వారసంతలో బీఆర్ఎస్ జోరు..**

కౌటాల, నవంబర్ 27: మండల కేంద్రంలోని వారసంతో బీఆర్ఎస్ ప్రచారం సోమవారం భారీగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసం నుంచి బస్టాండ్ వరకు వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీతో మండల కేంద్రం మొత్తం గులాబిమయంగా మారింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తరుపున ఆయన కుమారుడు కోనేరు వంశీ కృష్ణా ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే కోనప్ప కోడలు కోనేరు మధులిక మండలంలోని గుండాయిపేట, విర్దండి, మొగడ్‌ధగడ్, తలోడి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి గ్రామాల్లో భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలతో మండలం మొత్తం గులాబీ జెండాలతో నిండిపోయింది. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గెలుపు కోసం ప్రజలంతా సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సాధన కోసం అహర్నిశలు కష్టపడిన కేసీఆర్ సారే మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుతున్నారు. ఈ ప్రచారంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్ గౌడ్, గంగారాం, కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్‌రావు, యూత్ మండలాధ్యక్షుడు రవీందర్ గౌడ్, మహిళామండలాధ్యక్షురాలు బండి శైలజ గౌడ్‌లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తదితరులున్నారు.

**● చింతలమానేపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం**

చింతలమానేపల్లి , నవంబర్ 27 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. ఎంపీపీ డుబ్బుల నానయ్య ఆధ్వర్యంలో డబ్బా గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్‌సభ్యుడు నాజీమ్ హుస్సేన్, సందీప్, బొజ్జ హరి, సాంబయ్య, పాలే సత్తన్న, నాయకులు, కార్యకర్తలు, కోనేరు అభిమానులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లి : డబ్బాలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య



కాగజ్‌నగర్: ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప, నాయకులు



కౌటాల: కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కోనప్ప తనయుడు కోనేరు వంశీ కృష్ణా



బెజ్జూర్ : ఇంటింటా ఈవీఎం నమూనాను చూపుతూ ప్రచారం చేస్తున్న రమాదేవి



గురు నానక్ జయంతి సందర్భంగా సిక్కు సోదరులతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## ఘనంగా గురునానక్ జయంతి

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, నవంబర్ 27 : కాగజ్‌నగర్ పట్టణంలో సోమవా రం సిక్కుల మత గురువు గురునానక్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిర్పూర్ అభ్యర్థి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిక్కు సోదరులకు ఎంతో పవిత్రమైన ఈ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాగజ్‌నగర్ పట్టణం ఎన్నో మతాలకు, ఆచారాలకు, భాషలకు పుట్టినల్లు లాంటిదని, వివిధ సంప్రదాయాలు పాటించేవారు ఇక్కడ సోదరభావంతో ఐక్యమత్యంతో ఉంటారని అందుకే దీనిని మినీ ఇండియా అంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు, సిక్కు సోదరులు పాల్గొన్నారు.

## 28న మద్యం షాపులు బంద్

కాగజ్‌నగర్, నవంబర్ 27: తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఈ నెల 28 సాయంత్రం 5 గంటల నుంచి మద్యం దుకాణాలు, బార్లు, కల్లు కంపౌండ్లు మూసి వేస్తున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ మంగమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులను తెరుస్తామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించినా, మద్యం నిల్వ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్‌లో శాంత వద్ద అక్రమ మద్యం స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం విక్రయించినా, తరలించినా సెల్ : 8712658784నకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



దహెగాం: గెర్రెలో తులసీ దామోదర కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

దహెగాం,నవంబర్27 : మండలంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానాలు చేసి అందుబాటులోని ఆలయాలకు వెళ్లి పూజలు చేయడంతో పాటు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా వత్తులు వెలిగించారు. గెర్రె గ్రామంలో తులసి దామోదర కల్యాణం నిర్వహించి ఆకాశ దీపం మహోత్సవాన్ని చేపట్టారు.

## వైద్యం వికటించి 13 నెలల బాలుడి మృతి

కౌటాల, నవంబర్ 27: వైద్యం వికటించి 13 నెలల బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీకి చెందిన మల్యాల రాజశేఖర్–మౌనిక దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కొడుకు గౌతమ్, చిన్న కొడుకు జ్ఞానదీప్. జ్ఞానదీప్ సోమవారం వారి ఇంటి వద్ద ఆడుకుంటుండగా చేతి చిన్న వేలుకు ఇనుప సామగ్రి తగిలి గాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు అతన్ని మండల కేంద్రంలోని ఓ దవాఖానకు తీసుకెవెళ్లారు. అక్కడ ఉన్న వైద్యాధికారి బాలుడికి ఇంజక్షన్ ఇచ్చి, సిరప్ ఇచ్చాడు. ఏం కాదని ఇంటికి వెళ్లాక సిరప్ తాగిపించాలని చెప్పడంతో కుటుంబీకులు బాలుడిని తీసుకుని ఇంటికి వచ్చి సిరప్ తాగిపించినట్లు, ఆ సిరప్ తాగిన వెంటనే బాలుడు వాంతులు చేసుకోగ తిరిగి అదే దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ ఉన్న వైద్యాధికారి కాగజ్‌నగర్ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ తీసుకెళ్లగా అక్కడికి చేరేలోపే బాలుడు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తిరిగి కౌటాల మండల కేంద్రంలోని ఓ దవాఖానలో చేసిన చికిత్స వల్లే బాబు చనిపోయాడని దవాఖాన ముందు ఆందోళనకు దిగారు. దాదాపు మూడు గంటల పాటు దవాఖాన ముందు కుటుంబీకులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎస్ఐ మధుకర్‌లు అక్కడకు చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పారు. బాధ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళనను విరమింపజేశారు.